# ఎక్కవలసిన రైలు

## – సత్యం మందపాటి



"సాహితీ సిరికోన" వారి ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రీ జొన్నలగడ్డ రాంభొట్లు- సరోజమ్మ స్మారక పురస్కారం" బహుమతి అందుకున్న నవల.

*(గత సంచిక తరువాయి)*

**రేఖ వీణకు** ఫోన్ చేసింది.

"రేపు మా సుమకు రెండు నెలల పుట్టినరోజు. మిమ్మల్నందరినీ పిలిచి మొదటి నెల పుట్టినరోజు చేద్దాం అనుకున్నాంగానీ, మీకు తెలుసుగా అంతా హడావిడి అయిపోయీ, మనసు బాగాలేకా, అసలు దానికి హారతి కూడా ఇవ్వలేదు. ఈసారి అలా కాదని మిమ్మల్నీ, లీసానీ, డెబ్బీని మాత్రమే పిలుస్తున్నాము.
రేపు శెలవే కదా. మధ్యాహ్నం భోజనానికి మీరూ, అంకుల్ వచ్చేయండి" అన్నది.

"అప్పుడే సుమ పుట్టి రెండు నెలలయిందా? సుమ స్వీటీని మళ్ళీ చూడాలని వుంది. తప్పకుండా వస్తాం కానీ, లంచ్ వద్దులే" అంది వీణ.

"ఇంకో విశేషం కూడా వుంది. మా నాన్న తన బిజినెస్ పని మీద డెట్రాయిట్ వచ్చారు. రెండు రోజులు అయింది. ఇవాళ రాత్రికి ఇక్కడికి వస్తున్నారు. మిమ్మల్ని కలవాలనుకుంటున్నారు" అంది రేఖ.

ఆమె గొంతులో సంతోషమేకాక, ఎంతో ధైర్యం, ఉత్సాహం తెలుస్తూనే వున్నాయి.

"అలాగా? అయితే తప్పకుండా వస్తాం" అంది వీణ కూడా ఉత్సాహం చూపుతూ.

o o o

మర్నాడు కారు దిగి వస్తుంటే, గబగబా మెట్లు దిగి క్రిందికి వచ్చి, "నమస్కారమండీ. నా పేరు మురళి. రేఖకి నాన్నని" అన్నాడాయన.

వేణు కూడా పరిచయ పూర్వకంగా నవ్వి, “నా పేరు వేణు. ఈవిడ నా శ్రీమతి వీణ. అప్పుడు మీతో ఇండియాకి ఫోన్లో మాట్లాడాము కదా!” అన్నాడు తను కూడా నమస్కారం పెట్టి.

“మీరు రేఖకి చేసిన, చేస్తున్న సహాయం ఎంతో మరువలేనిది. థాంక్స్ అని చెబితే అది చాల చిన్న మాట. ఒక జీవితాన్ని, కాదు రెండు జీవితాలని నిలబెడుతున్నారు” అన్నాడు మురళి మళ్లీ ఇద్దరికీ నమస్కారం పెడుతూ.

“మేము చేసింది ఏమీ లేదండీ. ఆ పరిస్థితిలో ఇంకొక ఆడపిల్లకి తల్లిదండ్రులుగా మేము చేయగలిగిన ఉడతసాయం మేము చేశాం, అంతే” అంది వీణ.

రేఖ, లీసా సహాయంతో ఆరోజు ప్రొద్దున్నే లివింగ్ రూము అంతా రంగుల కాగితాలతో అలంకరించారు. ఒక పక్క గోడకి ‘Happy Birthday Dear Suma” అని ఒక బేనర్ కూడా పెట్టారు.

రేఖ, రాజేశ్వరి ఎదురొచ్చారు, “రండి” అంటూ.

రేఖ మురళిని పరిచయం చేయబోతే, వేణు “మీ నాన్నగారు ఇంతకుముందే పరిచయం అయారు” అన్నాడు నవ్వుతూ.

ముందు గదిలో సోఫాలూ, టీవీ, డైనింగ్ టేబుల్ వున్నాయి. రెండు గదుల్లోనూ మంచాలు, పరుపులు వున్నాయి.

“అన్నీ సమకూర్చుకున్నావే రేఖా, బాగుంది” అన్నది వీణ.

“అవును ఆంటీ. ఎప్పటికైనా కావలసిందే కదా. అందుకని లీజ్ కం పర్చేస్ మీద తీసుకున్నాను. లీసా రూమ్మేట్ డెబ్బీ మంచి డీల్ వుందని ఇప్పించింది. నెల వాయిదాలు ఫరవాలేదు. ఎప్పుడు ఏది మనం కొనుక్కోవాలంటే బాలన్స్ కడితే మనదయిపోతుంది” అంది రేఖ.

“గుడ్ జాబ్. వే టు గో” అన్నాడు వేణు.

సరళ పంపించిన ఉయ్యాల్లో పడుకుని, పైన కట్టిన రంగురంగు రామచిలుకలు సంగీతానికి తగ్గట్టు తిరుగుతుంటే, చేతులు కాళ్ళు వూపుతో, కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నది సుమ.

వీణ సుమ చేతి మీద ఒక ముద్దు ఇచ్చి, “హాపీ బర్త్ డే హనీ” అంది.

“పోయినసారి చూసిన దానికన్నా, సుమ ఇంకా పెద్దదయింది” అన్నాడు వేణు.

“ఇంత అందమైన ముద్దుల బంగారాన్ని చూసి కూడా వాళ్ళు అలా చేశారంటే నమ్మలేకపూతున్నాం” అన్నాడు మురళి.

“వాళ్ళకా అదృష్టం లేదు, అంతే” అన్నది కొంచెం కోపంగా రాజేశ్వరి.

“వదిలేయమ్మా. ఇంకా కొద్ది నెలల్లో వాళ్ళెవరో, మనమెవరో” అన్నది రేఖ.

“అవును. సరైన సమయంలో ఆ జైల్లో నించీ బయటకు వచ్చేసి మంచి పని చేశావు, రేఖా. అంతా మన మంచికే జరిగింది అనుకుని ముందుకు వెడదాం” అన్నాడు మురళి.

“రండి. భోజనాలు చేసి మాట్లాడుకుందాం” అంది రాజేశ్వరి.

రేఖ అన్నది, “అంకుల్, లీసానీ డెబ్బీని మూడు గంటలకి రమ్మన్నాను. వాళ్ళు వచ్చాక సుమకి హారతి ఇచ్చి, కేక్ కట్ చేద్దాం” అంది.

“నువ్వెలా ప్లాన్ చేస్తే అలా చేద్దాం” అన్నాడు వేణు.

“ఏమిటో చాలా వండావే. మనం ఇక్కడవుంది ఐదుగురమే!” అన్నది వీణ రాజేశ్వరితో.

రేఖ నవ్వుతూ అన్నది, “ఇందాక సుమకి చెప్పాను. ఇవాళ చాల మంచి రోజు. నీ పుట్టినరోజు. ఇద్దరు తాతలు, ఒక అమ్మమ్మ, ఒక బామ్మ, నేనూ, నా స్నేహితులూ నీ పుట్టినరోజు జరుపుకుంటున్నాం. హాపీ బర్త్ డే నాన్నా అని. అది చేతులు వూపింది సంతోషంగా”.

“అదే అడుగుదామనుకుంటున్నాను, సుమతో ఇవాళ పుట్టినరోజని చెప్పావా అని” అంది వీణ తను కూడా నవ్వుతూ.

అని మళ్ళీ అన్నది మురళితో, “నేను రెండు నెలలుగా చూస్తున్నాగా తల్లీ కూతుళ్ళ సంభాషణలు, రేఖ చెబుతుంటే సుమ వింటున్నట్టు చూస్తుంది, తల వూపుతుంది, నవ్వుతుంది”

“భాష అర్ధం కాకపోయినా పసిపాపలకి భావం అర్ధమవుతుందేమో” అన్నాడు వేణు సాలోచనగా.

“ఒక్క రేఖే కాదు, మురళి కూడా తను రాత్రి వచ్చినప్పటినించీ సుమతో ఏదో మాట్లాడుతూనే వున్నాడు. అర్ధమైనా కాకపోయినా అది వింటూ చిరునవ్వులు కురిపిస్తుంది. అది తాతా మనవరాలి అనుబంధంలే, వాళ్ళ లోకం వాళ్ళది” అంది రాజేశ్వరి.

“ఆఁ! అడుగుదామని మరచిపోయాను. రేఖా, నీ ఉద్యోగం ఎలావుంది?” అడిగాడు వేణు.

“బాగుంది అంకుల్. నేనంటే ఆఫీసులో అందరికీ ఇష్టమే. మా మేనేజర్ చెప్పాడు నావి ఫ్లెక్సిబుల్ అవర్స్ అని. ఎప్పుడైనా అవసరమైతే ఇంట్లోనించీ పనిచేయి, ఫరవాలేదు అన్నాడు. మంచివాడు” అన్నది రేఖ.

“బాగుంది. మనం మంచిగా వుంటే, మనతో వాళ్ళు కూడా మంచిగా వుంటారు” అన్నది వీణ.

సరిగ్గా మూడు అవగానే వచ్చారు లీసా, డెబ్బీ.

మురళి ఇండియానించీ తెచ్చిన పట్టు గౌను వేసింది రాజేశ్వరి. మెడలో తను తెచ్చిన సన్నటి బంగారం గొలుసు వేసింది.

సుమకి బొట్టు పెట్టి హారతి ఇచ్చింది. అందరూ అక్షింతలు వేశారు.

తర్వాత రేఖ సుమ చేయి పట్టుకుని, తనే కేక్ కట్ చేసింది.

వేలితో కేక్ మీద వున్న ఐసింగుని, సుమ నాలిక మీద రాసింది రేఖ.

సుమ ముందు ముఖం కొంచెం ఇబ్బందిగా పెట్టినా, కేక్ నచ్చినట్టుంది చప్పరిస్తున్నది.

"అయ్యయ్యో, రెండు నెలల పిల్లకలా ఏదిపడితే అది ఇవ్వకూడదు" అంది రాజేశ్వరి.

"ఫరవాలేదమ్మా. దాని పుట్టినరోజే కదా. ఊరికే అలా వేలితో రాశానంతే" అంది రేఖ.

లీసా అందరికీ కేక్ ముక్కలు చేసి, ప్లేట్లలో పెట్టి ఇస్తున్నది.

"ఎక్కడ పని చేస్తున్నావు" అని అడిగాడు వేణు డెబ్బీని.

"ఇంతకుముందు ఒక మెడికల్ ఆఫీసులో మెడికల్ ఇన్స్యూరెన్స్ వ్యవహారాలు చేస్తుండేదాన్ని. ఒక నెలన్నర అయింది, సైకాలజిష్టు ఒకాయన స్వంతంగా తన కౌన్సెలింగ్ ప్రాక్టీస్ పెట్టుకుని నన్ను తనతో పని చేయమన్నాడు. ఆయన కూడా ముందేదో గ్రూపులో పని చేశాడుగానీ, ఆయనకి అది నచ్చలేదు. ఆయనకి ఆఫీసు పనులన్నీ నేనే చేస్తున్నాను. ఎపాయింట్మెంట్లు ఇవ్వటం, పాత పేషెంట్లను పిలచి మాట్లాడటం, కొత్త పేషంట్లను తీసుకురావటం, ఇన్స్యూరెన్స్ వ్యవహారాలు ఒకటేమిటి సర్వం నేనే చేస్తున్నాను. నాకు జీతం ఎక్కువేకాక, స్వతంత్రం కూడా ఎక్కువే. ఆయన ప్రాక్టీసు ఇక్కడికి దగ్గరే. నాలుగు బ్లాకులు దాటగానే ఐదు అంతస్తుల బిల్డింగ్ కనిపిస్తుంది. మొదటి అంతస్తులోనే మా ఆఫీసు" అంది డెబ్బీ.

"అయన పేరు?" అడిగాడు.

"డాక్టర్ నికొలస్ బేకర్ అని. ఇక్కడొక గ్రూపులో చేయటం మానేశాక రెండు నెల్లు ఇంగ్లాండులో వెకేషన్ తీసుకుని, ఇక్కడి వచ్చి నెలన్నర అయింది. నన్ను అక్కడినించే ఫోన్ ఇంటర్వ్యూ చేసి ఉద్యోగం ఇచ్చాడు. రాగానే ప్రాక్టీస్ మొదలుపెట్టేశాడు. కౌన్సెలింగులో చాల మంచివాడు అని పేరు కూడా వుంది" అంది డెబ్బీ.

"బాగుంది. గుడ్ లక్ ఇన్ యువర్ న్యూ జాబ్" అన్నాడు వేణు.

కాసేపు కూర్చుని, తను ఎవరినో కలవాలని వెళ్ళిపోయింది డెబ్బీ.

రాజేశ్వరి, వీణ ఒక పక్కా, వేణూ మురళీ ఒక పక్కా కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

లీసా లేచి రేఖతో అంది, "క్రిందికి వెడదాం పద. నీతో మాట్లాడాలి" అని.

బయట నీరెండలో చల్లటి గాలి వీస్తూ హాయిగా వుంది.

లీసా అన్నది, "నీకో రహస్యం చెప్పాలి. డెబ్బీకి నీ సంగతీ, వాసు సంగతీ, మీరు విడిపోవటం సంగతీ, నీ విడాకుల కేసు సంగతీ ఏవీ తెలియదు. నేనూ చెప్పలేదు. తన ఆఫీసు సంగతులు నాకు చెబుతూ వుంటుంది సీక్రెట్ అంటూ. డెబ్బీ

బాస్ డాక్టర్ నికొలస్ బేకర్, నిక్ అని పిలుస్తారు అందరూ, అతను కోర్టు సమన్లు అందుకున్నాడుట, ఒక క్రిమినల్ కేసులో టెస్టిఫై చేయటానికి రమ్మనమని. ఆ కేసు ఏమిటో తెలిస్తే ఆశ్చర్యపోతావు, నీకూ కొంత కనెక్షన్ వున్నదే"

రేఖకి ఏమీ అర్ధం కాలేదు, "నాకా? నాకేమిటి సంబంధం?" అన్నది ఆశ్చర్యపోతూ.

"భయపడకు. నీకేమీ ఇబ్బంది లేదు. జరిగితే దానివల్ల నీకు మంచే జరుగుతుంది. అది నీ ఎక్స్ వాసు గురించి. నన్నెప్పుడూ నీకోసం మన ఆఫీసులో పిలుస్తుంటాడు కదా. డెబ్బీ చెప్పగానే అతనెవరో గుర్తుపట్టేశానుగానీ, డెబ్బీకి నీ సంగతులేవే చెప్పలేదు. వాసు కొన్ని నెలల క్రితం ఒక డిపార్ట్మెంట్ స్టోరులో పెద్ద గొడవ చేశాడుట. స్టోరులో అతను చాల పిచ్చిపిచ్చిగా ప్రవర్తించాడనీ, టీవీలూ, హోం అప్లయన్సులు పాడు చేశాడనీ, ఎంతో ధననష్టం చేశాడనీ, అక్కడ వున్న సేల్స్ అమ్మాయి మీద అరుస్తూ, సెక్సుయల్ అబ్యూస్ చేశాడని... ఒకటి కాదు. చాల కేసులు పెట్టారు. ఆరోజు పోలీసులు పట్టుకెళ్ళి జైల్లో వేస్తే, అతని నాన్న బెయిల్ ఇప్పించి విడిపించాడుట. ఆ కేసులో జడ్జి ఇతను సాడిస్టు అనీ, ఇతనిలో హింసాత్మకమైన ప్రవర్తన వున్నదనీ, అతనికి కోపం చాల ఎక్కువనీ కొన్నాళ్ళు కౌన్సెలింగ్ చేయించుకోవాలని నిర్దేసించాడు. అప్పుడు నిక్ తను ఇతరులతో కలిసి ప్రాక్టీస్ చేస్తున్న గ్రూపులో వున్నాడు. ఆయనకి ఈ కేసు ఇచ్చారట. వాసు రికార్డు అంతా డాక్టర్ నికొలెస్ దగ్గర వుంది. ఇప్పుడు ఇంకో మూడు వారాల్లో, నిక్ కోర్టుకి హాజరయి ఒక సాక్షిగా వాసు ప్రవర్తన గురించి టెస్టిఫై చేయాలన్నారుట. అంటే వాసు భవిష్యత్తు నిక్ చెప్పేదాని మీదే చాలవరకూ ఆధారపడి వుంటుందన్నమాట. నిక్ బేకర్ ఇవ్వబోయే టెస్టిమొనీ వాసుకి వ్యతిరేకంగా వుంటే, వాసుకి పెద్ద శిక్ష పడటమే కాక ఆ జడ్జిమెంటు ఫలితాలు నీకు ఉపయోగపడచ్చు" అన్నది లీసా.

రేఖ కూడా తనకి లాయర్ కార్సన్ ఈ విషయం ముందే చెప్పినా, తనకి తెలియనట్టు అన్నది, "అలా జరిగితే మంచిదే" అని.

"కానీ వాసు కేసు అయేదాకా మనమీ విషయం ఎవరితోనూ చెప్పటం, ముఖ్యంగా డెబ్బీకి మంచిది కాదు. అలా అని ప్రామిస్ చేస్తావా?" అన్నది లీసా.

"తప్పకుండా. నేను స్నేహానికి విలువ ఇచ్చే మనిషిని. ప్రామిస్" అంది రేఖ.

○ ○ ○

## 15

అశోక్ పూర్తిగా కోలుకున్నాడు.

సమీర గదికి వచ్చి ఆమె చేసిన సహాయానికి ఎన్నో ధన్యవాదాలు చెప్పాడు.

"కోవిడ్ వచ్చిందేమోనని నేను విపరీతంగా భయపడ్డాను. ఒంటరిగా గదిలో నీరసంగా పడుకుని ఆలోచిస్తుంటే, భయంకరమైన ఆలోచనలు వచ్చేవి. నేనంతగా భయపడటానికి రెండు కారణాలు. ఒకటి ఈ మధ్యనే కలకత్తాలో మా కుటుంబంలో ఇద్దరికి ముందు జ్వరంలాగా వచ్చి, అదే కోవిడుగా నిర్ధారణయి ఇద్దరూ
మరణించారు. వాళ్ళు సినిమాలకీ, పార్టీలకీ వెళ్ళే మనుష్యులు కూడా కాదు. ఎంతో జాగ్రత్తగా తమ ఆరోగ్యాలు చూసుకునే దగ్గర బంధువులు. అలా నాకు కూడా ఆయితే? చిన్నతనంలో నాన్న పోయినప్పటి నించీ, అమ్మే నన్నెన్నో ఆశలతో పెంచింది. నాకేమైనా అయిందని వార్త వింటే ఆవిడ గుండె ఆగిపోతుంది. ఇది రెండో కారణం. మీరు ఇచ్చిన ధైర్యంతో నా శరీరం మీరు చెప్పే మాటలు వింటున్నా, నా మనసు మాత్రం ఎన్నో అనుమానాలతో నన్ను వెర్రివాడిని చేసింది. ఇప్పుడు మనశ్శాంతిగా వుంది. నాకు మనసు బాగాలేనప్పుడు ఎంతో మానసిక ధైర్యం ఇచ్చి నా పక్కనే వున్నందుకు కృతజ్ఞతలు" అన్నాడు.

"మీరు పూర్తిగా కోలుకున్నందుకు సంతోషం. కానీ నేను చేసింది తోటి మానవులు ఎవరైనా చేసేదే" అన్నది.

అశోక్ మళ్ళీ ఇంకోసారి సమీరకి నమస్కారం చేసి, వెళ్ళిపోయాడు.

అశోక్ చాల మంచివాడు. సహృదయుడు అని సమీర మనస్సులో అనుకుంది.

అనుకోవటమే కాదు, అతన్ని రోజూ ఏదో మిష మీద కలుస్తూనే వుంది.

అప్పుడప్పుడూ "ఇదేమిటతని గురించి ఏమీ తెలుసుకోకుండానే ఎందుకీ తాపత్రయం" అనుకునేది. ఆరోజు రాత్రి సమీర ఏమీ తోచకపోతే, చికాగోలో తల్లి సులోచనకి ఫోన్ చేసింది.

బాగోగుల గురించి కొంత మాట్లాడుకున్నాక, సులోచన "అక్కడ ఎవరితోనైనా మాట్లాడుతున్నావా?" అని అడిగింది.

"రోజూ చాలమందితో మాట్లాడుతూ వున్నాను. రీసెర్చిలో వున్నప్పుడు మాట్లాడకపోతే ఎలా?" అంది.

"అది కాదు. నేను అడిగేదేమిటో నీకు తెలుసని నాకు తెలుసు" అన్నది సులోచన.

"కొంతమంది కొత్త స్నేహితులయారు. ఇద్దరు ముఖ్యంగా. కాని వాళ్ళు స్నేహితులు మాత్రమే. నువ్వు అనుకుంటున్నట్టు మాత్రం కాదు" అన్నది.

"మంచి స్నేహితులయితే మనతో చక్కగా జీవితం పంచుకుని మనల్ని సుఖపెడతారుగదా! ఇవాళ్టి దాకా యాభై ఏళ్ళుగా నేనూ మీ నాన్నా మంచి స్నేహితులమే, భార్యాభర్తలమే, దాంట్లో తప్పేముంది?" అన్నది ఒక తల్లిగా చెప్పవలసిన మాటలు చెబుతూ.

"అమ్మా! నాకు తెలుసు ఎవరు ఎలాటి వారో... ఒకవేళ అదే జరిగితే నేను మొట్టమొదటగా చెప్పేది నీకే. అంతేకాదు, ఎవరో నన్ను సుఖపెట్టనఖ్ఖరలేదు. నన్ను నేను సుఖపెట్టుకోగలను" అంది సమీర.

సులోచన మాట్లాడలేదు.

"నాన్న బాగున్నాడా?" అడిగింది సమీర.

"బాగున్నారు. తనకి బాగా వయసొస్తున్నదని ఎన్నో పరీక్షలు చేయించుకున్నారు. ఆయన ఆరోగ్యానికి ఢోకా ఏమీ లేదన్నారు డాక్టర్లు" అంది సులోచన.

"గుడ్! మీరు ఎప్పుడూ ఇంట్లోనించీ కదలరు గదా! నేనిక్కడ వున్నప్పుడే ఇంగ్లాండ్ వస్తారా? నేను అన్నీ చూపిస్తాను" అన్నది సమీర.

నవ్వింది సులోచన.

"నువ్వే మీ నాన్నని అడుగు" అంది.

"ఏం చేస్తున్నాడు, ఫోన్ ఇయ్యి"

"మీ నాన్న సెల్ ఫోన్లో తన ఎక్స్ అల్లుడితో మాట్లాడుతున్నారు" అంది సులోచన చిన్నగా నవ్వి.

సమీర ఆశ్చర్యపోయింది.

"అదేమిటి? విడాకులు తీసుకున్నాక కూడా అతనితో మాటలేమిటి? మధు డబ్బులేవైనా కావాలని వేధిస్తున్నాడా" అన్నది.

ఆమె గొంతులో కొంచెం కోపం కూడా తెలుస్తున్నది.

"ఏమోనమ్మా. అదికూడా మీ నాన్ననే అడుగు. ఒకటి మాత్రం తెలుసు. మీ నాన్నే డబ్బులేమైనా కావాలా అని ఒకటి రెండుసార్లు అడిగితే వద్దన్నాడు. అతనికి ఆత్మవిశ్వాసమే కాదు, ఆత్మాభిమానం కూడా ఎక్కువే! వారం వారం మధు మీ నాన్ననో, మీ నాన్న మధునో ఫోనులో పిలిచి మాట్లాడుతూనే వున్నారు. అక్కడ అట్లాంటాలో అతని ఉద్యోగం విషయంలోనూ, మిగతా విషయాల్లోనూ మధు మీ నాన్నని సలహాలు అడుగుతుంటాడు"

"మరి నువ్వేమీ చెప్పలేదా నాన్నకి?"

"ఏముంది చెప్పటానికి? ఒక స్నేహితుడిలా అతనితో మాట్లాడుతున్నాను, అంతకన్నా ఏమీ లేదు అంటే?" అన్నది సులోచన.

"అదికాదు. అతనంటే ఇంకా ఎందుకా ప్రేమని"

"నాకు అర్థమయిందేమిటంటే, మధు నిన్ను పెళ్ళి చేసుకున్నాక ఇండియాలో ఎంతో మంచి ఉద్యోగం వదులుకుని ఇక్కడికి వచ్చేశాడు. అతను అమెరికన్ సంస్కృతిలో ఇమడటానికి ఇబ్బందులు పడుతున్న సమయంలోనే, అనుకోకుండా హఠాత్తుగా విడాకులు కూడా వచ్చాయి. ఒంటరిగా చేతిలో ఒక్క డాలర్ కూడా లేకుండా, ఎవరో ఎక్కడో వున్న స్నేహితుడి దగ్గరకు వెళ్ళి, తన కాళ్ళ మీద తను నిలబడటానికి అవస్థలు పడుతున్నాడు. మీ నాన్న మొట్టమొదట అమెరికా

వచ్చినప్పుడు ఎన్నాళ్ళనించో ఇక్కడే వుంటున్న ఒక రావుగారు బాగా సహాయం చేశారు. ఆయన్ని రెండు కాళ్ళ మీద నిలబెట్టారు. నాన్న కూడా అలానే వాళ్ళు తనకి తెలియకపోయినా ఇక్కడ నిలదొక్కుకోటానికి ఎంతోమందికి సహాయం చేశారు. అందులో మధు ఒకడు అనుకున్నారు. అతనికి ఉద్యోగం వచ్చిందని చెప్పాక, ఎంతో సంతోషించారు కూడాను" అన్నది సులోచన.

ఫోన్ పెట్టేశాక ఏదో ఆలోచనలో పడింది సమీర.

*(ముగింపు వచ్చే నెలలో)*

Post your comments